వీడని ముంపు ముప్పు

- భీమిలి మండలానికి పోటెత్తుతున్న వరద
- తాటిపూడి రిజర్వాయర్ నీటి విడుదలతో ముంపు భయం
- ఇసుక బస్తాలతో గోస్తనికి అడ్డుకట్ట వేస్తున్న స్థానికులు
- చెరువులు నిండి ఇళ్లలోకి చేరుతున్న నీరు


మహరాజుపేట - పద్మనాభం రహదారిపై ప్రవహిస్తున్న వరదనీరు


టి.నగరపాలెం వద్ద గోస్తని నదికి ఇసుక బస్తాలతో అడ్డుకట్ట వేస్తున్న దృశ్యం


తాటితూరు జంక్షన్‌లో ఇళ్లలోకి ప్రవేశిస్తున్న వరదనీరు

తగరపువలస: భారీ వర్షాల కారణంగా భీమిలి మండలానికి వరద ప్రవాహం పోటెత్తుతోంది. తాటిపూడి రిజర్వాయర్ నుంచి భారీగా వరదనీటిని వదులుతుండటంతో మండల పరిధిలోని గోస్తని నది వెంబడి గ్రామ పంచాయతీలను ముంపు భయం వెంటాడుతోంది.

రహదారిపై నీటి ప్రవాహం

చెరువులన్నీ నిండిపోవడంతో నీరు దగ్గరలోని ఇళ్లలోకి చేరుతుంది. మహరాజుపేట-పద్మనాభం మార్గంలో తాటితూరు ఆంజనేయ స్వామి కూడలి వద్ద వరదనీరు రహదారికి ఇరువైపులా ఇళ్లలోకి చేరడంతో స్థానికులు ఖాళీ చేసి వెళ్లిపోయారు. రహదారిపై ప్రవహిస్తున్న నీటిలో నుంచే వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. టి.నగరపాలెం వద్ద గోస్తనినది ఉధృతికి భూభాగం కోతకు గురవుతుండగా సర్పంచ్ పొట్నూరు ఛాయాగౌతమి, ఎంపీటీసీ పల్లా నీలిమ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం నుంచి స్థానికులు సరుగుడు కర్రలు, సుమారు 500 ఇసుక బస్తాలతో అడ్డుకట్ట వేస్తున్నారు. వర్షాలకు గొల్లలపాలెంలో కూలిపోయిన రక్షణగోడ శిథిలాలను జేసీబీ సాయంతో తొలగించారు.

నీట మునిగిన పంటపొలాలు

టి.నగరపాలెం, తాటితూరు, సంగివలస పరిధిలో పాక్షికంగా పంటపొలాలు నీట మునిగిపోయాయి. కాగితాలపేటలోని అరటి, మల్లె, జాజి, మందార తోటల్లో వర్షంనీరు చేరడంతో రైతులు వాటిని సంరక్షించుకోవడానికి నీటిని మళ్లిస్తున్నారు. గోస్తనినదికి వరదనీటి తాకిడి కారణంగా తాటితూరు జెడ్పీ హైస్కూల్ ప్రహరీని తాకుతూ నీరు ప్రవహిస్తోంది. సంగివలస-పాండ్రంగి-బోని రహదారిలో మూడు మండలాలకు చెందిన పంచాయతీలలో వరద ముప్పు కారణంగా ఆయా పంచాయతీల ప్రజలు బిక్కుబిక్కుమంటూ ఇళ్లకే పరిమితం అయ్యారు. అవంతి కళాశాల ఎదురుగా జాతీయరహదారిని ఆనుకుని డ్రైనేజీలు పూడుకుపోయి వర్షంనీరు నిలిచిపోయి వాహనాల రాకపోకలకు ఆటంకం కలుగుతున్నందున జేసీబీల సాయంతో వాటిని తెరుస్తున్నారు. సంగివలస చెరువు చుట్టూ పారిశుద్ధ్య సిబ్బంది పూడిక తొలగించి సర్వీస్‌రోడ్డుపై నీరు నిలవనీయకుండా చర్యలు తీసుకుంటున్నారు.

ఎమ్మెల్యే పరిశీలన

పద్మనాభం: మండలంలోని వరద ప్రభావిత ప్రాంతాలను ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సోమవారం పరిశీలించారు. పొట్నూరులో వర్షపు నీరు ప్రవహిస్తున్న కాజ్‌వే ప్రాంతాన్ని, పాండ్రంగి సమీపంలో గోస్తని నదిని, నేరేళ్లవలసలో పడిపోయిన ఇళ్లను ఆయన పరిశీలించారు. బుడ్డివలస-అగ్రహారంలో పడిపోయిన పాత పాఠశాల భవనాన్ని పరిశీలించారు. సగం పడిపోగా మిగిలి ఉన్న సగం భవనాన్ని పొక్లెయిన్‌తో తొలగించారు. భవనం పడిపోయేంత వరకు ఎందుకు తొలగించ లేదంటూ సంబంధిత అధికారులపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన వెంట డీఈవో ఎల్.చంద్రకళ, తహసీల్దార్ అనంద్ కుమార్, ఎంఈవోలు పి.రమణ, బాబూలాల్, టీడీపీ నాయకులు కె.దామోదరరావు, కె.రమణ, కె.నగేష్‌కుమార్, ఎం.నందీశ్వరరావు పాల్గొన్నారు.


కాగితాలపేటలో పూలతోటల్లో నిలిచిన నీరు


స్థానికులు సిద్ధం చేసిన ఇసుక బస్తాలు


తాటితూరు పంచాయతీలో మునిగిన వరిపంట


తాటితూరు జెడ్పీ హైస్కూల్ వరకు వస్తున్న గోస్తని నది


బుడ్డివలస అగ్రహారంలో పడిపోయిన పాత పాఠశాల భవనాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గంటా

గోస్తని ఉధృతి

రాకపోకలకు అవస్థలు


మద్ది ఆనకట్టపై నుంచి ఉధృతంగా ప్రవహిస్తున్న గోస్తని నది

పద్మనాభం: మండలంలో గోస్తని నది పరవళ్లు తొక్కుతోంది. మద్ది ఆనకట్టపై నుంచి, పద్మనాభం గ్రామంలో బ్రిడ్జి వద్ద నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. పాండ్రంగి సమీపాన నదిలో నీరు కాజ్‌వే నుంచి ప్రవహిస్తోంది. దీంతో గ్రామస్తులు తగరపువలస, భీమునిపట్నం వంటి ప్రాంతాలకు సామయ్యవలస మీదుగా వెళ్లాల్సి వస్తోంది. మండల కేంద్రం పద్మనాభం, విజయనగరం ప్రాంతాలకు బోని, మద్ది జంక్షన్ మీదుగా చుట్టూ తిరిగి రావల్సి వస్తోంది. పొట్నూరు సమీపాన కాజ్‌వే పై నుంచి వర్షపు నీరు ప్రవహించడంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు.

సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

9705347494

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల టోకెన్ సమ్మె


జోనల్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

భీమునిపట్నం: జీవీఎంసీ తాగునీటి విభాగంలో పనిచేసే ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు సోమవారం ఒక రోజు టోకెన్ సమ్మె చేశారు. ఈ విభాగంలో పనిచేస్తున్న 61మందికి కనీస వేతనం రూ. 21వేలు చెల్లించాల్సి ఉండగా కేవలం రూ.15వేలు మాత్రమే చెల్లిస్తున్నారని వారు తెలిపారు. నిబంధనల ప్రకారం కనీస వేతనం చెల్లించాలని కోరుతూ సమ్మె చేసినట్టు చెప్పారు. ఈ మేరకు జోనల్ కార్యాలయం వద్ద ప్లకార్డులు చేపట్టి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉద్యోగులు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.రవి, ఎం.భాస్కర్, పి.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

98 ఎకరాల్లో నీట మునిగిన వరి

పద్మనాభం: రెండు రోజులు కురిసిన భారీ వర్షాలకు మండలంలోని పలు గ్రామాల్లో 98 ఎకరాల్లో వరి పంట నీటి ముంపునకు గురైంది. దీంతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. బాందేవుపురం పంచాయతీ మరికమ్మ చెరువు కింద ఆయకట్టు, పాండ్రంగి, బుడ్డివలస, కోరాడ తదితర గ్రామాల్లో వరి పంట నీటి ముంపునకు గురైంది. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి వేసిన పంట నీటి ముంపునకు గురవడంతో రైతన్నలు లబోదిబోమంటున్నారు.

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ దుర్మరణం


మృతదేహాన్ని తరలిస్తున్న భీమిలి పోలీసులు

తగరపువలస: భీమిలి మండలం తాళ్లవలస జాతీయరహదారిపై ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కోళ్లు రవాణా చేస్తున్న వాహనం డ్రైవర్ దుర్మరణం పాలయ్యాడు. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. సబ్బవరం నుంచి శ్రీకాకుళం వైపు వెళ్తున్న కోళ్ల వ్యాన్ లారీని ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో వ్యాన్ డ్రైవర్ మృతి చెందగా, క్లీనర్ తీవ్రంగా గాయపడ్డాడు. మృతుడు, క్షతగాత్రుడు, ప్రమాద వివరాలను భీమిలి పోలీసులు వెల్లడించవలసి ఉంది.

అక్షరమే అభివృద్ధికి ఆసరా


అవగాహన కార్యక్రమంలో డైట్ ప్రిన్సిపాల్ జ్యోతి కుమారి

భీమునిపట్నము: అక్షరమే అభివృద్ధికి ఆసరాగా నిలుస్తుందని జిల్లా విద్యా శిక్షణ సంస్థ ప్రిన్సిపాల్ ఎం.జ్యోతి కుమారి అన్నారు. ప్రపంచ అక్షరాస్యత దినోత్సవం సందర్భంగా భీమిలి డైట్ హాస్టల్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. భారతదేశం అక్షరాస్యతా శాతం స్వాతంత్య్రం వచ్చినప్పటి నుంచీ పెరుగుతూ వస్తోందన్నారు. ఇప్పుడు 74.04 ఉందని, ఇది ఆంధ్రప్రదేశ్ సగటు కంటే తక్కువని తెలిపారు. నిరక్షరాస్యత నిర్మూలనకు ప్రతీ ఒక్కరూ సహకరించాలని కోరారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత గొట్టిపాటి రవి మాట్లాడుతూ ఛాత్రోపాధ్యాయులు వారి నివాస ప్రాంతాల్లో పరిచయం ఉన్న వయోజనులైన నిరక్షరాస్యులను గుర్తించాలన్నారు. వారిలో నెలకు ఐదుగురు చొప్పున అక్షరాలు నేర్పించే విధంగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాల్లో జేసీ, ఆర్డీవో పర్యటన


టి.నగరపాలెం గోస్తని నది వద్ద జేసీ మయూర్ అశోక్, భీమిలి ఆర్డీవో భాస్కరరెడ్డి తదితరులు


గంభీరం రిజర్వాయర్ వద్ద భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

తగరపువలస: భీమిలి, ఆనందపురం ముంపు ప్రాంతాల్లో సోమవారం జేసీ మయూర్ అశోక్, భీమిలి ఆర్డీవో ఎస్.భాస్కరరెడ్డి, తహసీల్దార్లు పైల రామారావు, శ్యాంప్రసాద్, ఎంపీడీవో జానకి తదితరులు పర్యటించారు. భీమిలి మండలం టి.నగరపాలెం వద్ద గోస్తనినది వద్ద కోతకు గురవుతున్న ప్రదేశంలో ఇసుక బస్తాలతో అడ్డుకట్ట వేస్తున్న ప్రదేశాన్ని జేసీ పరిశీలించారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు పొట్నూరు చంద్రశేఖర్ నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. గతంలో దివీస్ లేబరేటరీ ఇక్కడ నదిపై నిర్మిస్తామన్న వంతెన ఆగిపోవడానికి కారణాలు తెలుసుకున్నారు. మరోమారు దివీస్ యాజమాన్యంతో చర్చించి వంతెన నిర్మాణానికి ముందుకు వెళ్దామన్నారు. అనంతరం ఆనందపురం మండలంలోని గంభీరం రిజర్వాయర్‌ను పరిశీలించారు.

గంభీరం రిజర్వాయర్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే

ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు భీమిలిలోని తాటితూరు, టి.నగరపాలెం, ఆనందపురం లోని గంభీరం రిజర్వాయర్ నీటిమట్టాన్ని పరిశీలించారు. గంభీరంలో ఆహ్లాదకరమైన వాతావరణం ఉన్నందున కాటేజీలు నిర్మిస్తే ఎక్కువ మంది పర్యాటకుల వస్తారన్నారు. జీవీఎంసీ సహకారంతో రిజర్వాయర్‌కు అప్రోచ్ రోడ్డు నిర్మిస్తామన్నారు. ప్రాణ నష్టం, పంట నష్టం జరుగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.

బిక్కుబిక్కుమంటున్న బిలాల్ కాలనీవాసులు

ఎమ్మెల్యే జాడ లేదని ఆందోళన

సీతమ్మధార: వర్షాలకు జీవీఎంసీ 14వ వార్డు పరిధిలోని బిలాల్ కాలనీ, ఏఎస్ఆర్ నగర్ ప్రజలు బిక్కుబిక్కుమని కాలం గడుపుతున్నారు. భీమిలి నియోజకవర్గ పరిధిలోని ఈ ప్రాంతం కొండవాలు కావడంతో, కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉందని హడలిపోతున్నారు. పరిస్థితి ఇంత తీవ్రంగా ఉన్నా ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు జాడ కూడా లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతం రూరల్ తహసీల్దార్ పరిధిలో ఉన్నా, సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ రమేష్ ఆ ప్రాంతంలో పర్యటించడం విశేషం. ఆయన సోమవారం బిలాల్ కాలనీ, ఏఎస్ఆర్ నగర్‌లలో పర్యటించారు. బిలాల్ కాలనీలో ప్రమాదకర ప్రాంతంలో ఉన్న నాలుగు కుటుంబాలు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాయని చెప్పారు. ఆయన వెంట ఆర్ఐ ఇబ్రహీం, వీఆర్వో పొన్నాడ నాగేశ్వరరావు, శ్రీధర్, బోని శ్రీను, ఇతర సిబ్బంది ఉన్నారు.

వారపుసంత తరలింపునకు స్థల పరిశీలన

మధురవాడ: వారపు సంత తరలింపునకు జీవీఎంసీ, ట్రాఫిక్ పోలీస్ అధికారులు సోమవారం స్థల పరిశీలన చేశారు. శనివారం వచ్చిందంటే .. సంత కారణంగా జీవీఎంసీ ఆఫీసు వైపు ఉన్న హైవే సర్వీసు రోడ్డులోకి ఎవరూ రాలేని పరిస్థితి. మధురవాడ అప్ బ్రిడ్జి నుంచి కొమ్మాది జంక్షన్ వరకు ప్రతీ వారం ట్రాఫిక్ అవస్థలే.

దీంతో వారపు సంత తరలింపునకు సాధ్యాసాధ్యాలను పరిశీలించేందుకు విశాఖ నార్త్ జోన్ ట్రాఫిక్ పోలీసు ఇన్‌స్పెక్టర్ కె.కాంతారావు, జీవీఎంసీ జోన్-2 ఏసీపీ శబ్నాన్ శాస్త్రి ఆధ్వర్యంలో ఇరు విభాగాల అధికారులు జీవీఎంసీ కార్యాలయం సమీపంలోని దేవదాయ శాఖ స్థలాన్ని పరిశీలించారు. అలాగే, కొమ్మాది రోడ్డులోకి తరలించాలన్న ఆలోచనలు కూడా ఉన్నాయి. కొద్ది సంవత్సరాల క్రితం అప్పటి జీవీఎంసీ కమిషనర్ ప్రవీణ్ కుమార్ వారపు సంతను తరలించాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. దీంతో అధికారులు, నాయకులు దీనిపై ప్రకటనలు చేస్తూనే ఉన్నా ఇప్పటికీ కార్యరూపం దాల్చలేదు. ఇప్పటికైనా తరలింపునకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.


జీవీఎంసీ కార్యాలయం సమీపంలోని దేవదాయ శాఖ స్థలం పరిశీలిస్తున్న జీవీఎంసీ, పోలీసు అధికారులు

ఫిర్యాదుదారులతో మర్యాదగా మెలగాలి

- సీపీ శంఖబ్రత బాగ్చి
- భీమిలి పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ


భీమిలి పోలీస్ స్టేషన్‌లో సిబ్బందితో మాట్లాడుతున్న సీపీ శంఖబ్రత బాగ్చి

తగరపువలస: పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులకు మర్యాద ఇచ్చి, కూర్చొబెట్టి వారి సమస్యలను వినాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి పోలీసులకు సూచించారు. కేసు విచారణను పారదర్శకంగా చేపట్టి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. భీమిలి పోలీస్ స్టేషన్‌ను ఆదివారం రాత్రి ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఫిర్యాదుదారులతో సిబ్బంది ప్రవర్తిస్తున్న తీరును స్వయంగా పరిశీలించారు. వారి సమస్యలు తెలుసుకుని పోలీస్ స్టేషన్ నుంచి పరిష్కరిస్తున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్టేషన్ బయట, లోపల నిశితంగా పరిశీలించిన ఆయన ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటాలని ఆదేశించారు. పోలీస్ క్వార్టర్స్‌కు మరమ్మతులు చేయించాలన్నారు. పెండింగ్ కేసులు తక్షణం పరిష్కరించి రిజిస్టర్లు ఎప్పుడూ అప్‌డేట్‌గా ఉంచాలని ఆదేశించారు. సిబ్బందికి ఏ సమస్యలు ఉన్నా తక్షణ పరిష్కారం కోసం 79950 95799 నంబరు ద్వారా తెలియచేయాలన్నారు. క్రైం పోలీస్ స్టేషన్ ఆవరణలోని సీజ్ చేసిన, వినియోగంలోని వాహనాలు పాడవకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్ల ప్రతీ కదలికను నిత్యం పరిశీలించాలన్నారు. స్టేషన్ పరిధిలో ఒక్క గంజాయి పెడ్లర్ కూడా ఉండకూడదని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. సిబ్బంది విధులలో ఎలాంటి అధికార దుర్వినియోగానికి పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు.

గోస్తని నది పరిశీలన

పద్మనాభం: గోస్తని నది వద్ద ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సీపీ శంఖబ్రత బాగ్చి ఆదేశించారు. పాండ్రంగి గ్రామాన్ని ఆదివారం రాత్రి సందర్శించిన ఆయన, జోరుగా ప్రవహిస్తున్న గోస్తని నదిని పరిశీలించారు. సీపీ మాట్లాడుతూ నదిలోకి ఎవరూ దిగి వెళ్లకుండా చూడాలని స్థానిక పోలీసులను ఆదేశించారు. ఆయన వెంట పద్మనాభం సీఐ శ్రీధర్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

ఏకదంతాయ.. బహు రూపాయ..


చంద్రంపాలెం భారీ గణనాథునికి పూజలు చేస్తున్న ప్రముఖులు, కమిటీ సభ్యులు


ఏకదంతుడు భిన్న రూపాల్లో కొలువుదీరాడు. శివ పుత్రుడిని, గౌరీ తనయుడిని వినూత్నంగా రూపొందించి మండపాల్లో ప్రతిష్ఠించి పూజలు చేస్తున్నారు భక్తులు. చంద్రంపాలెంలో ఏర్పాటు చేసిన భారీ గణనాథుడిని పరిసర ప్రాంతాల భక్తులు దర్శించుకుంటున్నారు. ఇక్కడ ఏర్పాటు చేసిన శివలింగానికి సోమవారం రుద్రాభిషేకం చేశారు. స్వామిని భీమిలి పంచాయతీరాజ్ డీడీవో బి. లక్ష్మీపతి దంపతులు దర్శించుకుని పూజలు చేశారు.

– తగరపువలస/మధురవాడ/కొమ్మాది


ఎండాడ బీసీ కాలనీలో కొలువైన వినాయకుడు


తాటితూరు రచ్చబండ వద్ద మండపంలో శివపుత్రుడు


కాగితాలపేట మండపంలో..


బంగ్లామెట్ట వద్ద మండపంలో చంద్రవంకలో గణేశుడు

పంటకాల్వల్లో పూడికలు


తుప్పలతో మూసుకుపోయిన పాండ్రంగి పంట కాలువ, పూడిక తొలగించని కురపల్లి పంట కాలువ

- ముంపు ముంగిట పల్లెలు

తగరపువలస: భీమిలి డివిజన్‌లో పంట కాలువల పూడికలు తొలగించకపోవడంతో చిన్న వర్షాలకే గ్రామాలు ముంపు బారిన పడుతున్నాయి. ప్రతి వేసవిలో ఉపాధి హామీ పనుల ద్వారా లేదా ఇరిగేషన్ విభాగాల ద్వారా పంటకాలువల పూడిక తొలగించి వర్షాకాలానికి ముందు సిద్ధం చేయాలి. దీంతో ఆయా ప్రాంతాల్లో కురిసిన వర్షం నీరు ఈకాలువల ద్వారా చెరువులోకి చేరి, అక్కడి నుంచి వ్యవసాయ భూములకు సాగు నీరు చేరుతుంది. నదులకు వరదనీరు పోటెత్తినప్పుడు కూడా ఈ పంట కాలువల ద్వారానే నీరు చెరువులకు చేరుతుంది. అలాంటి పంట కాలువలకు సెప్టెంబరు వచ్చినా పూడికతీత పనులు జరగకపోవడంతో వర్షంనీరు పంట కాలువల ద్వారా కాకుండా రోడ్లపై నుంచి ప్రవహిస్తోంది. రైతులకు అవసరం వచ్చినప్పుడు చెరువుల నుంచి పంటపొలాలకు నీరు మళ్లించేందుకు పంటకాలువలు సిద్ధంగా లేకపోవడంతో ఉసూరుమంటున్నారు. ప్రభుత్వం దృష్టి సారించి, పంట కాలువలలో పూడికతీత పనులు చేపట్టాలని భీమిలి డివిజన్ రైతులు కోరుతున్నారు.

బంగ్లామెట్ట సర్వీస్‌రోడ్డులో రాకపోకలు బంద్

సాక్షి ఎఫెక్ట్..


సాంఘిక సంక్షేమ కళాశాల వసతిగృహం ముందు సర్వీస్ రోడ్డుపై రాళ్లు అడ్డు పెట్టిన దృశ్యం

తగరపువలస: ఎట్టకేలకు జీవీఎంసీ ఒకటోవార్డు బంగ్లామెట్ట వద్ద సర్వీస్‌రోడ్డును బంద్ చేశారు. 'బంగ్లామెట్టపై పొంచి ఉన్న ప్రమాదం' శీర్షికతో సోమవారం సాక్షిలో ప్రచురితమైన వార్తకు జీవీఎంసీ అధికారులు స్పందించారు. భారీ వర్షాల కారణంగా ఆదివారం బంగ్లామెట్టపై నుంచి గ్రావెల్, రాళ్లు సర్వీస్‌రోడ్డుపై పడుతుండటాన్ని సాక్షిలో హెచ్చరించిన సంగతి తెలిసిందే. దీంతో స్థానిక పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కరమాని రామునాయుడు గ్రావెల్ జారిన కొండప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం భీమిలి జెడ్పీ కనకమహాలక్ష్మి , ఏసీపీ దవళ శ్రీనివాసరావు తదితరులు వచ్చి బంగ్లామెట్ట పరిసరాలను పరిశీలించారు. రామన్నపేట అండర్‌పాస్, బంగ్లామెట్ట పోలీస్ అవుట్‌పోస్ట్ వద్ద స్టాపర్లతో రహదారిని మూసివేశారు. అలాగే మెట్ట ప్రాంతం వద్ద వాహనాలు వెళ్లకుండా రాళ్లు అడ్డం పెట్టారు.

కూలిన చంద్రంపాలెం హైస్కూల్ ప్రహరీ

మధురవాడ: వర్షాలకు మధురవాడలో ఓ చోట స్వల్పంగా కొండ చరియ జారిపడగా మరో రెండు చోట్ల గోడలు కూలిపోయాయి. చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల-సిద్ధేశ్వర స్వామి పీఠం మధ్య ఉన్న ప్రహరీ గోడ సుమారు 30 అడుగుల మేర కూలిపోయింది.

- శారదానగర్ జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీని ఆనుకుని ఉన్న కాలనీలో కొండను తొలచి నిర్మాణం చేసిన ఇంటిపై కొండ చరియలు కొద్ది మేరకు జారి పడ్డాయి.
- చంద్రంపాలెం వద్ద హైవేని ఆనుకుని ఉన్న ఒక గోడ వర్షానికి బాగా తడిచిపోవడంతో ఉన్నట్టుండి కూలిపోయింది. ఇక్కడ పానీ పూరి అమ్ముతున్న వ్యక్తికి తృటిలో పెద్ద ప్రమాదం తప్పింది. స్వల్పంగా గాయపడ్డాడు. బడ్డీ మాత్రం పూర్తిగా ధ్వంసమైంది. సుమారు రూ.15వేలు మేర ఆస్తి నష్టం సంభవించింది.


కూలిన చంద్రంపాలెం హైస్కూల్ ప్రహరీ గోడ

వెళ్లిరా.. వినాయకా..

కొమ్మాది: వినాయకచవితిని పురస్కరించుకుని మూడు రోజుల పాటు పూజలు అందుకున్న గణనాథుడిని నగర ప్రజలు సాగరంలో నిమజ్జనం చేస్తున్నారు. బీచ్ రోడ్డు సాగర్‌నగర్, రుషికొండ ఐటీ జంక్షన్, మంగమారిపేట బీచ్‌ల వద్ద సోమవారం పూజ చేసిన వినాయక విగ్రహాలను సముద్రంలో నిమజ్జనం చేశారు.


సాగర్‌నగర్ బీచ్‌కు నిమజ్జనానికి వినాయక విగ్రహాన్ని తీసుకొస్తున్న యువకులు